తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





ఆరేపల్లి రంగంపేటలో

# జల్లికట్టు సంబరాలు

## పట్టీల కోసం యువత పల్టీలు

## ఎంఎల్ఏ నానిని భుజాలకెత్తుకున్న అభిమానులు





చంద్రగిరి, జనవరి 21 ప్రభాతవార్త: పట్టీలను కైవశం చేసుకునేందుకు యువత పల్టీలు కొట్టారు. ఆరేపల్లి రంగంపేటలో కనుమ రోజున జరుపుకునే జల్లికట్టు సంబరాలను అనివార్య కారణలతో వాయిదా వేశారు. ఇందులో భాగంగా బుధవారం ఆరేపల్లి రంగంపేటలో జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటాయి. జల్లికట్టు సంబరాలకు వందలాది పాడి ఆవులను, ఎద్దులను ముస్తాబు చేశారు. ఏడాదికి ఒకమారు పాడిరైతులు జరుపుకునే పశువుల పండుగ రోజున ఏరువాకలో తమకు చేదోడుగా నిలిచి పండిన పంటలను ఇంటికి చేర్చే కాడెద్దులకు పూజలు జరిపించి వాటిలోని ఉత్సాహాన్ని, పౌరుషాన్ని వెలికితీయడమే లక్ష్యంగా జల్లికట్టు సంబరాలు నిర్వహిస్తారు. రైతులు తమ ఎద్దు కొమ్ములకు పట్టీని కట్టి జనంలోకి వదలిపెడతారు. జల్లికట్టు సంబరాలలో తమ పౌరుషాన్ని ధీటుగా ప్రదర్శించేందుకు యువత సైతం రెట్టించిన ఉత్సాహంతో పోటెత్తిన పోట్లగిత_్తలను నిలువరించి పట్టీని సొంతం చేసుకునేందుకే పోరాటమే చేశారు. పలువురు యువకులు పల్టీలుకొట్టి గాయాలపాలయ్యారు.

### -ప్రత్యేక ఆకర్షణ ఎంఎల్ఏ పులివర్తి నాని

ఆరేపల్లి రంగంపేట జల్లికట్టు సంబరాలకు రాష్ట్రంలో విశిష్ట స్థానం ఉంది. ఈ నేపథ్యంలో జల్లికట్టు సంబరాలను పురస్కరించుకుని బుధవారం రంగంపేట వీధుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరీ, విద్యాశాఖ మంత్రి లోకేష్, ఎంఎల్ఏ పులివర్తి నాని, ఆయన సతీమణి పులివర్తి సుధారెడ్డి, తనయుడు పులివర్తి వినీల్ ఫ్లెక్సీలను అడుగడుగునా ఏర్పాటు చేయడంతో పాటు ట్రాక్టర్లలో అమర్చి డిజే మోతలతో గ్రామంలో ఊరేగించారు. ఈ క్రమంలో గ్రామానికి వచ్చిన ఎంఎల్ఏని అభిమానులు భుజాలకెత్తుకుని గ్రామవీధులలో ఊరేగించారు.

# చంద్రగిరిలో రెండు ఇళ్ళలో చోరీ ..

## క్లూస్ టీమ్ వేలిముద్రల సేకరణ

చంద్రగిరి, జనవరి 21 ప్రభాతవార్త: చంద్రగిరి దాసరివీధిలో మంగళవారం రాత్రి రెండు ఇళ్ళలో దొంగలు పడి అందినకాడికి దోచుకుపోయారు. సమాచారం అందుకున్న సిఐ సురేష్‌కుమార్, ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి సంఘటనా స్థలికి చేరుకుని క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు సేకరించినట్లు తెలిసింది. కాగా బాధితులు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీలకు పాల్పడిన నిందితులు ఆయా నివాసాలలోని సిసి కెమెరాలను ధ్వంసం చేశారు. నిందితులు ఓ ఇంట్లో రూ.10 లక్షల విలువైన బంగారు. మరో ఇంట్లో రూ.50 వేలు విలువైన వెండి వస్తువులను దోచుకుపోయినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సంక్షేమ పథకాలను

# పారదర్శకంగా అమలు చేయండి

## రాష్ట్ర శాసనసభ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి




తిరుపతి కలెక్టరేట్, జనవరి 21 ప్రభాతవార్త: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయాలని రాష్ట్ర శాసనసభ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆమె అన్నారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమంపై అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై శాసన సభ డిప్యూటీ సెక్రటరీ ఆర్.వనితరాణి, జిల్లా కలెక్టర్ డా వెంకటేశ్వర్, కమిటీ సభ్యులతో కలసి చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాల వివరాలను కమిటీకి సమర్పించారు.సంక్షేమ పథకాలను పారదర్శకతతో సమర్థవంతంగా అమలు చేస్తూ లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత చురుకుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో శాసనసభ కమిటీ సభ్యులు పల్లె సింధూర రెడ్డి, లోకం నాగమాధవి, వరపుల సత్యప్రభ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ రెడ్డి, కల్పలత, మధుసూదన్, డిఆర్ఓ జి నర్సింహులు, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. వినోద్ కుమార్, ఐసిడిఎస్ అధికారిని వసంతబాయి, సోషల్ వెల్ఫేర్ డిడి విక్రమ్ కుమార్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజా సోము, బీసీ వెల్ఫేర్ డిడి భరత్ కుమార్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి చెన్నారెడ్డి, డిఆర్డిఏ పిడి ప్రభావతి, మెప్మా పిడి ఇఫ్రామ్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చైర్మన్ పాత్రికేయులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడమే లక్ష్యంగా కమిటీలో ఉన్న వారు కృషి చేస్తున్నామని

# ఆ ఒక్కరోజు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు

## -మాఢవీధుల్లో సంతృప్తికర సౌకర్యాలు

## -రథసప్తమి విజయవంతానికి టిటిడి ఈఓ సింఘాల్ సమీక్ష



తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి: ఆదివారం సప్తమితిధిన ఏడుకొండల్లో జరిగే ఏడువాహనసేవలు (మినీబ్రహ్మోత్సవం) విజయవంతం చేయడంపై టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ అధికారయంత్రాంగంతో సమీక్షించారు.ఆదివారం ఒక్కరోజు ఉదయం నుండి రాత్రి వరకు అర్థబ్రహ్మోత్సవం వేళ భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం ఘట్టాలకు భక్తులు ఎక్కువగా రావడం జరుగుతుందని, దీనికి పూర్తిస్థాయిలో ప్రణాళికాబద్దంగా ఏర్పాట్లు చేశామన్నారు. సామాన్యభక్తుల కోసం ఆలయ పరిసరాల్లోనూ, మాఢవీధుల్లోనూ టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. గ్యాల రీలు,ప్రత్యేక జర్మన్‌షెడ్లు నిర్మించింది. గ్యాలరీల్లోని భక్తులకు అసౌకర్యం కలగకుండా ,ఏమాత్రం చిన్నపాటి లోటులేకుండా నిరంతరా యంగా అన్నప్రసాదాలు, తాగునీరు,టీ,కాఫీ పంపిణీ చేసేందుకు టిటిడి ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, డిప్యూటేషన్ సిబ్బంది సిద్దమయ్యారన్నారు. ఈ వేడుకలకు విచ్చేయనున్న భక్తుల రద్దకి అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్ర`త్తలు, పటిష్ట ఏర్పాట్లపై బుధవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఈఓఅనిల్‌కుమార్‌సింఘాల్ అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి జెఈఓ వీరబ్రహ్మాం, సివి ఎస్ఓ కెవి మురళీకృష్ణ, తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య, టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారిరవి,తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ తదితర జిల్లా అధికారులతో గంటన్నరకు పైగా సమీక్షించారు. తిరుమలలోని గ్యాలరీల్లో,అనేక చోట్ల వేచివుండే భక్తులకు అసౌకర్యం కలగకుండా, ఏమాత్రం చిన్నపాటి లోటులేకుండా చూడాలన్నారు. భక్తులు గ్యాలరీల్లోకి చేరుకునేలా, నిష్క్రమణ సాఫీగా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

# టూవీలర్‌ను ఢీకొన్న టిప్పర్

## ఒకరు దుర్మరణం

## మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మృతిచెందిన రెడ్డెప్ప.

పెద్దపంజాణి జనవరి21 ప్రభాతవార్త: సంక్రాంతి పండగ జరుపుకుంటున్న పొట్టగానిపల్లి గ్రామంలో తీవ్రవిషాదం నెలకొంది. పొట్టగానిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వీరిని టిప్పర్‌లారీ ఢీకొనడంతో వీరిలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు,పోలీసులు తెలిపినమేరకు వివరాలిలా.. పొట్టగానిపల్లి గ్రామానికి చెందిన కిట్టప్ప కుమారుడు రెడ్డెప్ప(32), వీరప్ప కుమారుడు మునిరాజ (50),అగస్తి కుమారుడు మునిరత్నం (42) వీరుముగ్గురూ పల్సర్ వాహనంలో పంజాణి నుండి పొట్టగానిపల్లికు వెళుతుండగా అదే సమయంలో పలమనేరు- మదనపల్లి జాతీయ రహదారిలోని కౌండిన్యనదీ సమీపంలో వేగంగావచ్చిన టిప్పర్ వీరిని ఢీకొంది.దీంతో వాహనం నడుపుతున్న రెడ్డెప్ప తలకు బలమైన గాయం తగిలింది. మిగతా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.వీరిని హుటాహుటిన పలమనేరు,తిరుపతికి చికిత్సనిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో రెడ్డెప్ప మృతి చెందాడు. మృతుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారెప్ప తెలిపారు.

# కుప్పం రూపురేఖలు మార్చేలా సిఎం కృషి

## - కడ పి.డి.వికాస్ మర్మత్



కుప్పం, జనవరి 21 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు కుప్పం రూపురేఖలు మార్చేందుకు అన్నివిధాలా కృషి చేస్తున్నారని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. బుధవారం కడ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అధ ్వర్య ంలో జరిగిన కుప్పం భవిష్యత్తుపై ఆలోచన సదస్సులో పి.డి. పాల్గొని ప్రసంగించారు. ఏడాదిన్నర కాలంలోనే కుప్పంలో కోట్లాది రూపాయలతో అభివృద్ది పనులకు సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. 2203కోట్లతో ఏడు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారని వీటిద్వారా 20-30వేల ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ముమ్ముందు మరిన్ని పరిశ్రమలు కుప్పం రాబోతున్నాయన్నారు. అలాగే కుప్పం ప్రాంతంలో రైతుల సౌకర్యార్థం కృష్ణాజలాలు తీసుకువచ్చి చెరువులు నింపుతున్నారన్నారు. తద్వారా కరువు ఛాయలు తొలగుతాయన్నారు. వీటితో పాటు కుప్పం మున్సిపాలిటీని సైతం అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కడద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు తగు సహాయ సహకారాలు అందించడంతో పాటు గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలోపేతం చెందేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కుప్పం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కుప్పం అభివృద్ధికి తగు సలహాలు, సూచనలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సోమశేఖర్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణుగోపాల్, తిరుమగళ్, చిరువ్యాపారుల సంఘ అధ్యక్షుడు మంజునాథ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# పేరుకే అవుట్‌పోస్ట్: మూన్నాళ్ళ ముచ్చటే!

## రాత్రి వేళల్లో సిబ్బంది భయం భయంగా...



ఆసుపత్రి ఆవరణలో ఖాళీగా ఉన్న పోలీసు అవుట్ పోస్టు భవనం

శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి ఆవరణలో రోగులు,సిబ్బంది రక్షణకు ఏర్పాటు చేసిన పోలీసు అవుట్ పోస్టు మూనాళ్ళ ముచ్చటగా మారింది. ఆసుపత్రిలోకి ప్రవేశించాలంటే కాటిల్ గార్డు అడ్డంకి ప్రవేశిస్తూనే ఓ ఖాళీ గది దర్శన మిస్తుంది. అదే పోలీసు అవుట్ పోస్టు.కానీ ఇక్కడ ఎవ్వరూ ఉండరు. శ్రీకాళహస్తి పట్టణంలో సువిశాలమైన 11 ఎకరాల స్థలంలో మొదట వంద పడకల ఆసుపత్రిని 1999లో నిర్మించారు. ప్రపంచ బ్యాంకు నిధులతో ఈ నిర్మాణాలు జరిగాయి. అయితే గత పాలనలో ఆ పార్టీ నాయకుల పెత్తనం పెచ్చుపెరిగింది. ఆసుపత్రిలో డ్యూటీ సిబ్బందిపై దాడులు,దౌర్జన్యాలు అధికమయ్యాయి. ఈ పరిస్థితిలో ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించుకొని ఇక్కడ పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో సిబ్బందికి రక్షణ కల్పించాలని ఆదేశించారు.'ఆంధ్రుల ఆర్భాట శూరత్వం అన్నట్లు' స్థానిక డివైయస్‌పి నరసింహామూర్తి ఇక్కడ వెంటనే ఆసుపత్రి ప్రవేశం వద్ద ఆసుపత్రికి సంబంధించిన ఓ గదిని తీసుకొని ఏర్పాటు చేసారు. అయితే ఎంఎల్ఏ మాట 'మూనాళ్ళ ముచ్చటగా' మారింది. ప్రస్తుతం ఈ గది ఖాళీగా ఉంది.ఇక్కడ పోలీసులు లేరు. నిఘా లేదు. ఆసుపత్రిలో పని చేసే డ్యూటీ డాక్టర్లకు, నర్సులకు రాత్రి గడవటం గగనంగా మారుతుంది. తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి చోటు చేసుకుంది.ఇప్పటికైనా పాలకులు ఓ నిర్ణయం తీసుకున్నపూడు అది సక్రమంగా అమలు జరుగుతుందా? లేదా? అనేది చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# సాన్నిహిత్యం...విశ్వాసం

## విశ్రాంత అధికారికి జెఈఓగా బాధ్యతలు!

## -టిటిడిలో మొట్టమొదటిసారిగా డాక్టర్ శరత్‌కు అవకాశం



తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఉన్న సన్నిహితం...పాలనలో సమర్థవంతమైన అధికారిగా విశ్వాసం వెరసి టిటిడిలో కీలకమైన జెఈఓ పదవిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఏ.శరత్ నియమించబడ్డారు. ఈయన సిఎం బాబుకు నమ్మినబంటుగా ఉన్నారు. టిటిడి చరిత్రలో మొట్టమొదటిసారిగా విశ్రాంత ఐఏఎస్ అధికారికి జెఈఓగా బాధ్యతలు అప్పగించడమని అధికారవర్గాల్లో చర్చనీయాంశమైంది. 2005 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎ.శరత్ గతంలో తెలంగాణా కేడర్‌లో మంచిపాలన అందించిన అధికారిగా పేరుంది. అంతేగాక గ్రూప్ 1అధికారిగా డాక్టర్ శరత్ 1990లో ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మదనపల్లి ఆర్‌డిఓగాను, సిఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో కుప్పం పట్టణాభివృద్ధిసంస్థ(కడ)స్పెషాలాఫీసర్‌గా కూడా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారు.టిటిడి అభివృద్ధిలో, భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచడంలో రాజీలేని ధోరణితో పనిచేస్తారని నమ్మకంతో ఆయన ఏరికోరి డాక్టర్ శరత్‌కు బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకత. కాగా టిటిడిలో ఇప్పటివరకు విశ్రాంత అధికారులను ప్రత్యేక అధికారులుగా, సలహాదారులుగా, కాంట్రాక్టు విధానంలో నియమించేవారు. తాజా జెఈఓ నియామకంపై టిటిడి ఉద్యోగ వర్గాల్లో చర్చమొదలైంది.

# పర్యావరణ సహిత పరిశోధనలు చేపట్టాలి : డాక్టర్ శ్రీలత



తిరుపతి విద్య,జనవరి 21 ప్రభాత వార్త ఎస్ వి వ్యవసాయ కళాశాల నందు నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఎస్ వి వెటర్నరీ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వ్యవసాయ పశుపోషణ రంగంలో రసాయనిక మందుల వాడకం పెరగడం వలన మానవ ఆరోగ్యంతో పాటు పశుసంపద ఆరోగ్యం పైన తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని , వ్యవసాయ శాస్త్రవేత్తలు పశు వైద్య శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను పర్యావరణ సహితంగా చేపట్టాలని తద్వారా పంట ఉత్పత్తులు ,పశుసంబంధిత ఉత్పత్తులలో రసాయనాల శాతాన్ని తగ్గించి మానవాళి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయ పశు వైద్య రంగాల పరిశోధనలను సమ్మిళితంగా నిర్వహించడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ కృష్ణనెమలి పర్ద్యూ యూనివర్సిటీ యూఎస్ఏ మాట్లాడుతూ ఈ జాతీయ సదస్సులో చర్చించిన పరిశోధన అంశాలు భారతీయ శాస్త్రవేత్తల యొక్క అద్భుత ప్రతిభను ప్రదర్శించాయని, యువ శాస్త్రవేత్తలు ముఖ్యంగా మహిళా శాస్త్రవేత్తలు జాతీయ అంశాలతో పాటు గ్లోబల్ అంశాల మీద పరిశోధన చేపట్టి తద్వారా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. తర్వాత డాక్టర్ శరత్ బాబు మాజీ డైరెక్టర్ నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ హైదరాబాద్ మెరుగైన విత్తన రకాలను గుర్తించి పరిశోధనలలో వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్లాంట్ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్, ప్రాంతీయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ వి సుమతి, వెటర్నరీ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ జగపతి రామయ్య, జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంకే జోత్స్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ప్రదీప్ మన్యం, వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు, వ్యవసాయ కళాశాల అధ్యాపక సిబ్బంది, పరిశోధక విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నీటితో నిండిన చెరువులో ఉపాధి పనులు చేశారట!

## 21లక్షలకు బిల్లులు.. ఉపాధిహామీలో ఇదో రకం దోపిడీ..



.నీటితో నిండిన వి.కోటచెరువు

వి.కోట,జనవరి 21 ప్రభాతవార్త పేదలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం కొంతమంది అక్రమార్కులకు నిధులు కురిపిస్తోంది. వి.కోట మండలంలో ఉపాధిలో నిధులు కాజేసేందుకు కొత్త రకం దోపిడీకి తెరలేపారు. ఏకంగా లక్షల్లో బిల్లులు పెట్టారు. ఈ అంశం మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. వి.కోట పెద్ద చెరువు128.35 ఎకరాల్లో విస్తరించి ఉంది. రెండు నెలలుగా చెరువు నీటితో నిండి మరువపారుతోంది. ఓ పక్క రబీసీజన్‌లో వర్షాలు కురవడం, మరో పక్క హంద్రీ-నీవా కాలువల ద్వారా నీళ్ల రావడంతో చెరువు నిండుకుండలా మారింది. ఈ తరుణంలో ఈ చెరువులో ఉపాధి పనులు జరిగినట్లు కొందరు నేతలు, ఉపాధిసిబ్బంది కుమ్మక్కై చేయని పనులకు కూలీలతో పనులు చేయించినట్లు మస్టర్లలో నమోదు చేసి ఏకంగా 21.33లక్షలకు బిల్లులు పెట్టారు. ఈవిషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పూర్తి_గా నీటితో నిండి ఉన్న చెరువులో చేపలు పెంచేందుకు కుంటల నిర్మాణంతో పాటు చిన్నపాటి చెరువు పనులు చేపట్టినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. 2025నవంబర్ నుంచి పనులు చేపట్టారని పేర్కొన్నారు. నీటితో నిండిన చెరువులో పనులు చేపట్టి బిల్లులు పొందడం ఏమిటని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. పనుల మంజూరు, కూలీల హాజరు, పనుల కొలతలు, బిల్లులు పెట్టే ఉపాధి సిబ్బంది కొంతమంది నేతలతో కుమ్మక్కై ఇలా వ్యవహరించారనే ఆరోపణలు జోరుగా వినబడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఈ అంశంపై విచారణ జరిపి నిధుల రికవరీ చేయడంతో పాటు ఇందుకు బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏది ఏమైనా ఈ వ్యవహారం ఇప్పుడు మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది.

వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా

# మీటర్లు అమరిక పూర్తిచేయాలి

## రాష్ట్ర సిఎస్ విజయానంద్ ఆదేశం



తిరుపతి,జనవరి 21ప్రభాతవార్త: తిరుపతి ఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో రూఫ్‌టాఫ్ సౌరవిద్యుత్ వినియోగాన్ని వేగవంతంచేయాలని,వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మీటర్ల అమరికను తక్షణం పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సిఎస్ కె.విజయానంద్ ఎస్పీడిసిఎల్ అధికారులను ఆదేశించారు. ఈవీ ఛార్జింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన అమలుచేయాలని ఆయన స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా పిఎం సూర్యఘర్, ముఫ్తిబిజ్లీ యోజనను సమర్థవంతంగా అమలుచేయాలని ఆయన సూచించారు. బుధవారం మధ్యాహ్నం తిరుపతిలోని ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సిఎండి శివశంకర్‌లోతేటి ,నెడ్కాప్ ఎండి ఎం.కమలాకర్‌బాబు, ఎస్పీడిసిఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, తొమ్మిదిజిల్లాల ఎస్పీడిసిఎల్ సంస్థ ఎస్ఇలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సౌరవిద్యుత్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షించారు. పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో గృహాలకు రూఫ్‌టాఫ్ సౌరవిద్యుత్‌వినియోగాన్ని వేగవంతం చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

## పకడ్బందీగా ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు

– జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



**చిత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త:** ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలు–2026లో భాగంగా జనవరి 27 నుండి ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. డిఆర్‌ఓ ఛాంబర్‌లో బుధవారం డిఆర్‌ఓ మోహన్‌కుమార్ ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షల పక్కా నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ మొదటి, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి 71 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంటర్మీడియేట్ మొదటి ఏడాది థియరీకి సంబంధించి 14,729, ద్వితీయ సంవత్సరంలో 14,550 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. అలాగే ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి మొదటి సంవత్సరం 1,470, ప్రాక్టికల్ ద్వితీయ సంవత్సరంకు సంబంధించి 9,937 మంది హాజరు కానున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పక్కా చర్యలు చేపట్టాలని, ఆర్టీసీ సకాలంలో విద్యార్థులను పరీక్షా కేంద్రాల వరకు బస్సులన నడుపాలని, పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం కలుగకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఐఈఓ రఘుపతి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, సి సెక్షన్ సూపరిటెండెంట్ బ్యూలా, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.సయ్యద్ మౌల, ఎన్.దయానందరాజు, మురళీధర్, వెంకటరమణారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారులు, డిఎంహెచ్‌ఓ కార్యాలయ అదికారులు, ట్రాన్స్‌కో అధికారులుహాజరయ్యారు.

## రైతులు ఇ-పంట నమోదు చేసుకోవాలి : జిల్లా వ్యవసాయాధికారి



**కుప్పం, జనవరి 21 ప్రభాతవార్త** రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఇ-పంట యాప్‌లో తప్పక నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళి సూచించారు. బుధవారం నడిమూరులో ఇ- పంట నమోదుపై రైతులతో గ్రామసభ నిర్వహించి ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఇ - పంటలో నమోదు చేయించుకోకపోతే అన్నదాత సుఖీభవతో పాటు పంటభీమా కోల్పోయే అవకాశం ఉందన్నారు. కాగా రైతులుపంటలసాగులో ఎరువులు, యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. వివిధ పంటల సాగులో ఆధునిక పద్ధతులు మరియు చీడపీడల నివారణ, నీటి యాజమాన్యం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎడిఎ సావిత్రి, వ్యవసాయాధికారి ఫయాజ్‌బాషా, రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

## పూలసాగు రైతులకు ప్రభుత్వం రాయితీ



**కుప్పం, జనవరి 21 ప్రభాతవార్త** పూలసాగు చేపడుతున్న రైతులకు ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా ఎనిమిది వేల రూపాయల రాయితీ అందిస్తోందని ఉద్యానవన అధికారులు డింపుప్రియశ్రీ, వింధ్య తెలిపారు. బంతి,చామంతి, రోజా, కనకాంబరం, మల్లి తదితర రకాల పూలసాగు చేస్తున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని నాలుగుమండలాల్లో 284 ఎకరాల్లో పూలతోటలు సాగు చేస్తున్న రైతులకు రాయితీ కోసం ప్రతిపాదించామన్నారు. రాయితీ కోసం రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను స ంప్రదించి ఆధార్, భూమి పాస్ పుస్తకం, బా ్యంకు ఖాతా నకళ్లు, నారుబిల్లు అందించి రాయితీ పొందవచ్చున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారుకోరారు.

## బిజెపి జాతీయ అధ్యక్షుడి నియామకంపై హర్షం



**శాంతిపురం, జనవరి 21 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఎంపిక కావడం పట్ల బిజెపి మండల అధ్యక్షుడు గజేంద్ర, ఉపాధ్యక్షుడు కుమార్, ఎస్సీమోర్చా అధ్యక్షుడు వెంకటేష్, రవి హర్షం వ్యక్తం చేశారు. 45 ఏళ్ల వయసులోనే నబీన్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. నబీన్ నేతృత్వ ంలో దేశంలో భాజపా అత్యంత శక్తివంతంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## వెంకటేపల్లిలో పొలంబడి కార్యక్రమం



**శాంతిపురం, జనవరి 21 ప్రభాతవార్త** మండలంలోని వెంకటేపల్లి గ్రామంలో బుధవారం రైతు ధను ంజయ అరటితోటలో పొలంబడి కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ విధానాలు, సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారాలు, వ్యవసాయ అనుబంధ శాఖల్లో రైతులకు కలిగే లబ్ది, రాయితీల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎడిఎ సావిత్రి,ఎఒయువకిషోర్, హెచ్‌ఓ వింధ్య, పట్టుశాఖ అధికారి రామకృష్ణ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కెనమాకులపల్లిలో పశువైద్య శిబిరం



**శాంతిపురం, జనవరి 21 ప్రభాతవార్త** మండలంలోని కెనమాకులపల్లిలో బుధవారం పశువైద్యాధికారులచే పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాడి రైతులను ఆదుకునేందుకు పాడి పరిశ్రమను ప్రోత్సహించేలా పశువులకు ఎలాంటి వ్యాధులు సంక్రమించకుండా వైద్య శిబిరాలు నిర్వహించడ ంతో పాటు ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నేతలు కేదార్‌నాథ్, శివ, హరినాథ్‌రెడ్డి, కోదండప్ప, రాధాకృష్ణకుమార్,రైతులు పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

***రామకుప్పం, జనవరి 21 ప్రభాతవార్త*** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై వెంకటమోహన్ సూచించారు. బుధవారం గుట్టూరు తాండా గ్రామంలో గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## జగనన్న పాలనలో అందరికీ సంక్షేమాలు

### అధికార ప్రతినిధి శ్యామల

**రైల్వేకోడూరు, జనవరి 21 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అన్ని సంక్షేమ ఫలాలు అందరికీ అందేవని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శ్యామల అన్నారు. బుధవారం ఒక ప్రత్యేక కార్యక్రమానికి పాల్గొనే దానికి వెళ్లేందుకు కొద్దిసేపు కోడూరు లోని వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైల్వే కోడూరు లో వైసీపీ కార్యకర్తలు ఎంతో హుషారుగా ఉన్నారని, రానున్నది మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమమే అని ఆమె అన్నారు. రైల్వే కోడూరు నుండి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు తనకు స్వాగతం పలికేందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీ పార్టీకి ప్రజలు పట్టం కడతారని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు విరక్తి చెంది ఉన్నారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలపై కక్ష సాధింపుగా పనిచేస్తుందని ఆమె అన్నారు. ఈ వైసిపికి చెందిన ఆర్ వి రమణ మైనార్టీ నాయకులు పేట షఫీ, కృష్ణారెడ్డి, బి మనీ, గౌతమ్ రెడ్డి, వైయస్ కరిముల్లా తో పాటు రైల్వేకోడూరు మండలానికి చెందిన వైసిపి కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి వాహనాలు నడపడమే ముద్దు : ఎస్.ఐ

ఓబులవారిపల్లి, జనవరి 21 ప్రభాతవార్త :



ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడమే ముద్దు అని, ఎలిమెంట్ లేకుండా ప్రయాణం వద్దని ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ అన్నారు బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రమాదాల జరిగినప్పుడు అధికంగా హెల్మెట్ లేకుండా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఎలిమెంట్లు ధరించి వాహనాలు నడపండి ప్రాణాలు కాపాడుకోండి ఆయన వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి వాళ్ళు సూచనలు సలహాలు ఇచ్చారు. అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులు ఇంటిలోని వారి పెద్దలు ఎలిమెంట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని ప్రతి రోజు గుర్తు చేయాలని ఆయన కోరారు.

## ధైర్య స్పర్శపై నర్సింగ్ విద్యార్థినిలకు అవగాహన



**చిత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రధాన ఆసుపత్రిలోని నర్సింగ్ కళాశాలలో బుధవారం మహి ళా స్టేషన్ ఎస్ఐ కరీమున్నిసా నర్సింగ్ విద్యార్థినిలకు ధైర్య స్పర్శ, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, బాల్య వివాహ నిరోధక చట్టం తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా ఎస్ఐ కరీమున్నిసా మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ప్రతి ఒక్కరికి మంచి–చెడు తెలిసేలా అవగాహన కలిగి వుండాల న్నారు. ఎవరైనా అనవసరంగా తాకితే మీకు అసౌకర్యంగా అనిపిస్తే సత్వరం నో అని చెప్పి నమ్మకమైన గురువు లేదా తల్లిదండ్రులు లేదా పోలీసులకు చెప్పాలన్నారు. 18 సంవత్సరాల్లోపు మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే కఠిన శిక్షలు వున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు ఎప్పుడైన జరిగితే సత్వరం పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు 112, 1098 వంటి హెల్ప్ లైన్లను గుర్తువుంచుకుని ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం శక్తియాప్‌ను ఏర్పాటు చేసిందని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం

**రొంపిచెర్ల, జనవరి 21, ప్రభాతవార్త:**

మండలంలోని చెంచమరెడ్డి గారి పల్లి గ్రామపంచాయతీ ఆర్. బెస్తపల్లిలో ఒక యువతి అదృశ్యమైనట్లు తండ్రి రొంపిచెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మధుసూదన్ కథనం మేరకు.. వెంకటరమణ కుమార్తె తేజశ్రీ (20) మంగళవారం ఉదయం నుంచి కనబడడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువుల ఇళ్ల వద్ద, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించామని తెలిపారు. తన ఆచూకీ ఎక్కడ కనబడలేదని అన్నారు. పోలీసులు తన కుమార్తె ఆచూకీ తెలుసుకొని తనకు అప్పగించాలని కోరారు. తండ్రి ఫిర్యాదు మేరకు రొంపిచెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన



**చిత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త:** చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన వుండాలని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య పేర్కొన్నారు. చిత్తూరు బిఎస్ కన్నన్ జూనియర్ కళాశాల, మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు బుధవారం టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించి నేరాల కట్టడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టుటౌన్ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారితో పాటు వారి వెనుక కూర్చొని ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే మహిళలు, ఆడపిల్లలపై ఎక్కడైనా వేధింపులు జరిగితే 112 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించి తక్షణ రక్షణ పొందాలన్నారు. మాదకద్రవ్యాల పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలన్నారు. డ్రగ్స్, గంజాయిలకు సంబంధించి సమాచారం ఎద్దైనా వుంటే సత్వరం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తులసీరామ్, భద్ర–4 సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ సునీల్‌కుమార్



**చిత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త:** పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ బుధవారం తాడేపల్లిలోని రాష్ట్ర వైకాపా అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహ న్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్‌కుమార్ పూతలపట్టు నియోజక వర్గ పరిధిలో చేపట్టిన వైకాపా సభ్యత్వ నమోదు, ప్రభుత్వ వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమా లను మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి వివరించారు. నియోజకవర్గ పరిధిలో వైకాపా నాయకు లందరినీ సమన్వయం చేసుకుని పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళా లని మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఆదేశించారు.

## నేడు మరో 3 కేంద్రాల్లో యూరియా పంపిణీ

**యాదమరి, జనవరి 21 ప్రభాతవార్త:**

రైతులకు పంటల సాగుకు అవసరార్థం యాదమరి మండల పరిధిలో మరో 3 రైతు సేవా కేంద్రాల్లో గురువారం యూరియాను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి దీప తెలిపారు. ఈ మేరకు గురువారం ఉదయం 10 గంటల నుండి దాసరాపల్లి, 184 గొల్లపల్లి, మోర్ధానపల్లి రైతు సేవా కేంద్రాల్లో యూరియా రైతులకు అందుబాటులో వుంటుందన్నారు. యూరియా అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్ కార్డును తీసుకెళ్ళి యూరియా పొందవచ్చునన్నారు.

## పరీక్షా విధానంలో మార్పులు

– రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ అసోసియేట్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

**చిత్తూరుహెల్త్, జనవరి 21 ప్రభాతవార్త:**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ప్రస్తుతం వున్న పాఠ్యపుస్తకాలతో పాటు పరీక్షా విధానంలో మార్పులు తీసుకురావాలని రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎ అసోసియేట్ అధ్యక్షులు వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రానున్న విద్యాసంవత్సరం నుండి జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అన్ని తరగతులు సిలబస్‌ను రూపకల్పన చేయాలని ఆయన ప్రభుత్వంను కోరారు. విద్యార్థుల్లో తార్కిక ఆలోచన, విశ్లేషణాత్మక శక్తి, ప్రయోగాత్మక ఆలోచనలు కలిగేలా పాఠ్యపుస్తకాలను ముద్రించాలన్నారు. అలాగే సాంఘిక శాస్త్రం, చరిత్రతో పాటు పలు పాఠ్యాంశాల్లో స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్పులు వుండాలన్నారు. అలాగే పాఠ్యపుస్తకాల తయారీలో క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశాల్లో అభిప్రాయాలు సేకరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత మూల్యాంకన విధానం పాఠ్యాంశాల బోధనకు పెద్ద అవరోధనగా మారిందన్నారు. అలాగే జిల్లా స్థాయిలో కామన్ ఎగ్జామినేషన్ బోర్డుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## భక్తిశ్రద్ధలతో ఓంశక్తి అమ్మకు పూజలు

**గుడిపాల, జనవరి 21 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని పాపసముద్రం పంచాయతీ అడవిచేను గ్రామంలో బుధవారం ఓంశక్తి మాల ధారణ చేసిన భక్తులు, గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాల ధరించిన ఓం శక్తి భక్తులు అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించి మేళతాళాలతో అమ్మవారిని కొలిచి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఓంశక్తి భక్తులు మాట్లాడుతూ తమిళనాడులోని మేళ్వరవత్తూరు ఓం శక్తి ఆలయంకు మాల ధారణతో వెళ్ళి మొక్కులు తీర్చి అక్కడే మాల తీసివేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భక్తులు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

## పురోహితుడు వాసుదేవ శర్మ మృతి బాధాకరం



**ఓబులవారిపల్లి, జనవరి 21 ప్రభాతవార్త :** ఓబుల వారిపల్లి మండలం వైకోట గుండాలకోన నీలకంఠేశ్వర స్వామి గుడి పురోహితుడు వాసుదేవ శర్మ అకస్మిక మృతి బాధాకరమని కూడా చైర్మన్ టిడిపి ఇంచార్జ్ రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వైకోట గ్రామంలో నివాసం ఉంటూ నీలకంఠేశ్వరుడు గుడిలో పురోహితులుగా ఎన్నో సంవత్సరాలుగా ఆ భగవంతుని సేవ చేశారన్నారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తిని వేణుగోపాల్ రెడ్డి, కూటమి నాయకులు ప్రేమ్ కుమార్, అడపాల బాలాజీ, కమతం నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండూరులో ప్రభుత్వ భూమి వినియోగంపై చర్యలు

– సర్వేకు ఆదేశించిన తహసీల్దార్



పెనగలూరు. జనవరి 21 ప్రభాతవార్త రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండల పరిధిలోని కొండూరు గ్రామంలో ప్రభుత్వ భూమి వినియోగంపై గ్రామస్తులు అధికారులను ఆశ్రయించారు. కొండూరులోని ప్రభుత్వ భూమి సర్వే నంబరు 1116లో దాదాపు 19 ఎకరాలు నిరుపయోగంగా ఉన్నాయని, ఈ భూమిని గ్రామాభివృద్ధికి, ప్రజలకు ఉపయోగపడే పనుల కోసం కేటాయించాలని గ్రామస్తులు పెనగలూరు మండల తహసీల్దార్ అమరేశ్వరిని కోరారు. గ్రామస్తుల వినతికి సానుకూలంగా స్పందించిన తహసీల్దార్, తక్షణమే సర్వేయర్‌ను పిలిపించి భూమిని సర్వే చేయిస్తామని తెలిపారు. సర్వే పూర్తైన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆ భూమిని గ్రామ అవసరాలకు అనుగుణంగా, ప్రజలకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూముల సద్వినియోగంతో గ్రామీణ అభివృద్ధి సాధ్యమవుతుందని, అధికారుల స్పందన అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేయాలి

– తలకోన నీటి వృథాను అరికట్టాలి

– నష్ట పరిహారం రావాలంటే పంట నమోదు తప్పనిసరి



***యర్రావారిపాలెం, జనవరి 21, ప్రభాతవార్త*** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేయాలని తహసీల్దార్ వాసుదేవ కుమార్ తెలిపారు. బుధవారం యర్రావారిపాలెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చేయాలని కోరారు. మండలంలోని రైతులు భూముల రీసర్వేకు సహకరించాలని కోరారు. అలాగే హౌసింగ్ పథకం కింద అర్హత ఉండి ఇల్లు నిర్మించు కోవాలనే వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రస్తుతం ఒకొక్కరికి 3 సెంట్లు చొప్పున ఇళ్ల నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అర్హులైన వారు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 70 మంది లబ్ధిదారులకు ఇంటి స్థలాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే 437 ఇళ్లకు అనుభవ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ భూములు కాపాడుకుందామని అన్నారు. భవిష్యత్తు తరాల కోసం ప్రభుత్వ భూములు ఆక్రమణలు కాకుండా చూడాలని కోరారు. ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లా డుతూ అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందజేయాలని సూచించారు. జెడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చేయాలని కోరారు. ఉద్యానవన శాఖ అధికారిణి ఆసియా మాట్లాడుతూ వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో పంట నమోదు చేయడం జరుగుతున్నదని అన్నారు. తలకోన నీరు వృథాగా వెళుతుందని, నీటి వృథాను అరికట్టాలని ఇరిగేషన్ అధికారులకు సర్పంచ్‌లు కోరారు. బోడే వాండ్ల పల్లిలో 4 చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు మరమ్మతులకు గురయ్యాయని అన్నారు. దేశినాయిని చెరువు, ఆవుల చెరువు లను వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. ఉస్తికాయల పెంట, యల్లమంద లో త్రాగు నీటి సమస్య ఉందని సర్పంచ్‌లు ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కరుణాకర్ రెడ్డి, ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంపీడీవో దివాకర్, ట్రాన్స్‌కో ఏఈ జ్యోతి ప్రసాద్, ఎంఈవో బాలసుబ్రమణ్యం, తలకోన ఆలయ కమిటీ చైర్మెన్ సోమనాథ రెడ్డి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైష్ణవీమాతా జగజ్జననీ పాహిమాం...!



**చౌడేపల్లి, జనవరి 21 ప్రభాతవార్త** వైష్ణవీమాతా పాహిమాం అంటూ భక్తులు అమ్మవారి చెంత మోకరిల్లారు. పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీమాతా ఆలయంలో జరుగుతున్న శారదా నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారికి ప్రదానార్చకురాలు శ్రావణి పంచామృతాభిషేకం నిర్వహించి విశేషాలంకరణ తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది. పుంగనూరు నవత ట్రాన్స్‌ఫోర్టు పురుషోత్తమరెడ్డి, వసంతలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## హుండీ ద్వారా రూ. 57వేలు ఆదాయం

చౌడేపల్లి, జనవరి 21 ప్రభాతవార్త



సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండకు హుండీ ద్వారా రూ. 57,935లు ఆదాయంగా సమ కూరినట్లు టిటిడి ఆలయ పర్యవేక్షకుడు భానుప్రకాష్ తెలిపారు. బండపై గల ప్రసన్న ఆంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో సుమారు 4నెలలకుగాను హుండీని లెక్కించగా నగదును భక్తులు కానుకలుగా సమర్పించార న్నారు. ఆలయ ప్రధానార్చకుడు కృష్ణమూర్తి, టిటిడి పరకామణీ సిబ్బంది పాల్గొన్నారు.

## దశలవారీగా ఆలయాల అభివృద్ధి

చౌడేపల్లి, జనవరి 21 ప్రభాతవార్త



దశలవారీగా ఆలయాల అభివృద్ధిని చేపట్టనున్నట్లు హరిహర హనుమదీశ్వర అయ్యప్ప సాయిరాం చారిట బుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.కె.వెంకట్రమ ణారెడ్డి అన్నారు. బండ్లపల్లిలో గల శివాలయం, వేణు గోపాలస్వామి, బోయకొండ గంగమ్మ ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటును పరిశీలించారు. బండ్లపల్లిలోని శివాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల అభివృద్ధికి ట్రస్టును ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా వేణుగోపాలస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు తన వంతు సాయంగా టిటిడికి ఎస్‌డీ నిధులు చెల్లిస్తాననీ, తద్వారా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించుకోవచ్చునన్నారు. ట్రస్టుద్వారా మరిన్ని ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి జల్లి మనోహర్, నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలతో బతుకు బుగ్గిపాలు : కేశవరెడ్డి



**చౌడేపల్లి, జనవరి 21 ప్రభాతవార్త** మూఢనమ్మ కాలతో బతుకులు బుగ్గిపాలు చేసుకోవద్దని ఎంఇఓ కేశవరెడ్డి అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం కాగతి ప్రాథమికోన్నత పాఠశాలలో క్షుద్రపూ జల కలకలం రేపడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విజ్ఞానం కొంత పుంతలు తొక్కుతున్న ప్రస్తుత సమయంలో మూఢనమ్మకాలు కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోందన్నారు. చేతబడులు, వశీకరణలు వంటివి నమ్మవద్దనీ, ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం మూఢనమ్మకాలు, శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు దామోధరం, ఉపాధ్యాయులు ఎవి.సుబ్రమణ్యం, శ్రీధర్, ప్రసన్నకుమారి, పూర్ణిమ, సుబ్రమణ్యం, శ్రీలత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి : ఆర్డీఓ

బైరెడ్డిపల్లి జనవరి 21 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి బుధవారం పలమనేరు ఆర్డీఓ భవాని సందర్శించారు. ఈ సందర్భంగా రెవిన్యూ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ, మండల రెవెన్యూ సమస్యల పైన చర్చించారు. ఈ సందర్భంగా రీసర్వేలో వచ్చినటువంటి లోటుపాట్లను సరిదిద్దే క్రమంలో ప్రత్యేకించి సలహాలు సూచనలను చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల తహసిల్దార్ ప్రసన్నకుమార్,ఆర్ఐ దామోదర్ ఆచారి,డిప్యూటీ తహసిల్దార్ అశోక్,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల సాగుపై రైతులకు అవగాహన

**రామకుప్పం, జనవరి 21 ప్రభాతవార్త** రైతులు సాగు చేస్తున్న పంటలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చల్దిగానిపల్లి గ్రామ రైతులతో పంటల సాగుపై సమీక్షి ంచారు. సులభమైన డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చన్నారు. పంట దిగుబడి మార్కెట్ విక్రయాలపై పలు సూచనలు అందజేశారు. రైతు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం ద్వారా అందుతున్న బ్యాంకు రుణాలు, సబ్సిడీలు తదితరు వాటిని సద్వినియోగంచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు

## పంచాయతీలకు సైకిళ్ళు,తోపుడు బండ్లు పంపిణీ

**వి.కోట, జనవరి 21 ప్రభాతవార్త :** వి.కోట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు.స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర గ్రామ పంచాయతీలలో చెత్త సేకరణకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాటానికి వి.కోట మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు మూడు చక్రాల సైకిళ్ళు,5 గ్రామ పంచాయతీలకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, రాష్ట్ర వేర్హౌస్ డైరెక్టర్ రంగనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్ర నాయుడు,మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు ,ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, నారాయణస్వామి, హరినాథ్ రెడ్డి, ధీరజ్,వైస్ సర్పంచ్ అక్మల్, గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

## రంగోత్సవంలో నల్లపురెడ్డి పల్లె విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి ,

రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత

**పెనగలూరు, జనవరి 21 ప్రభాతవార్త :** రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్ )లో నిర్వహించిన ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవం 2026 పోటీలలో నల్లపురెడ్డి పల్లె విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కృష్ణమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో తమ సృజనాత్మకతతో అందరినీ ఆకట్టుకుని జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నల్లపురెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాన్సి, హిమజా, తులసి తమ అద్భుత కళా నైపుణ్యంతో "వికసిత్ భరత్ మా స్వప్నం" అనే ఇతివృత్తాన్ని కళ్లకు కట్టినట్లుగా రంగవల్లి రూపంలో తీర్చిదిద్దారని చెప్పారు. దేశాభివృద్ధి, సాంకేతికత మరియు సంస్కృతిని మేళవిస్తూ వారు వేసిన ఈ ముగ్గు పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు చెప్పారు. విద్యార్థులు సృజనాత్మకతను న్యాయనిర్ణేతలు, డైట్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి

# ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేది ఉద్యోగులే : డిఎం



వెంకటగిరి, జనవరి 21 ప్రభాతవార్త: ఆర్టీసీనే లాభాల బాటలో నడిపించేది ఉద్యోగులేనని డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభ నందు డిపోలో ఇంధన పొదుపు చేసిన ఉత్తమ డ్రైవర్లు అయిన బి.రాము, బి.మోహన్‌ను, ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ డి.నాగూర్ రెడ్డి, కె.నాగరాజ, పి.భాస్కర్‌రావుని, సంక్రాంతి ఆపరేషన్స్‌లో అత్యధిక ఆదాయం సాధించిన పి.వెంకటేశ్వర్లు, పి.శ్రీధర్‌రెడ్డి కండక్టర్‌ను డిపో ఉద్యోగుల సమక్షంలో అభినందించారు. వారికి డిపో మేనేజర్ పెన్స్‌ను బహుకరించారు. డిపో మేనేజర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపో నందు గల మిగతా ఉద్యోగులు వీరిని ఆదర్శంగా తీసుకొని డిపోకి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ ఆపరేషన్, ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీశక్తి పథకం విజయవంతంగా నిర్వహించి నందుకు గ్యారేజి,ట్రాఫిక్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమం నందు మెకానికల్ ఇంజనీర్ ఏ.ప్రభాకర్, డిపో సూపర్ వైజర్స్, ఆఫీసు సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కాలభైరవ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ



నాయుడుపేట, జనవరి 21 ప్రభాతవార్త: మండలంలోని మేనకూరు గ్రామంలో వెలసిన శివాలయంలో కాలభైరవ విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి, సురేఖ రెడ్డి దంపతులు భూమి పూజ చేశారు. ఆలయ పూజారులు పూజలు నిర్వహించి, కట్టా వెంకట రమణారెడ్డి, సురేఖరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలోని శివాలయంలో తమ సొంత నిధులతో కాలభైరవ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

## తాగునీటి బోరుకు మరమ్మతులు



నాయుడుపేట, జనవరి 21 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసపురం ఎస్టీ కాలనీలో గత వారం రోజులుగా మున్సిపాలిటీ కొళాయిల్లో తాగునీరు రాకపోవడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు పనబాక గంగబాబు, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బందితో కలిసి కాలనీలోని బోరును మరమ్మతు చేయించారు. తమ కాలనీలో మున్సిపాలిటీ వారి ఏర్పాటు చేసిన వీధి కొళాయిల్లో గత వారం రోజులుగా తాగునీరు సరఫరా కాక పోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని కాలనీవాసులు తెలియజేశారు. విద్యుత్ శాఖ వారు కరెంట్ పోల్స్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో తాగునీటి పైపులైన్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ధ్వంసం అయిన పైపులైన్ల మరమ్మతులు మున్సిపాలిటీ వారు చేపట్టకపోవడంతో తాము తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులను పడుతున్నామని కాలనీవాసులు తెలియజేశారు.

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యునికి సన్మానం



నాయుడుపేట, జనవరి 21 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీపతి బాబును పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఎస్సీ కమిషన్ సభ్యులుగా నియమితులైన శ్రీపతి బాబు విజయవాడలోని ఎస్సీ కమిషన్ కార్యాలయంలో బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు మాజీ మంత్రి డాక్టర్ పరసరత్నం,చిట్టమూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గుంపర్ల చిన్నారావు, అన్నమేడు బూత్ కమిటీ కన్వీనర్ పిగిలాం చెంగయ్య, కోడివాక మోహన్ పలువురు నాయకులు శాలువాలు కప్పి, పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ కమిషన్ సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన శ్రీపతి బాబు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

## పైప్ లైన్ సమస్యను పరిష్కరించిన అధికారులు



వాకాడు, జనవరి 21 ప్రభాతవార్త: మండలం అందలమాల పంచాయితీ పరిధిలోని ఎస్సీ కాలనీలో పైప్ లైన్ సమస్యను బుధవారం ఎంపీడీవో సాయిప్రసాద్, టిడిపి మండల పార్టీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలిలు పరిష్కరించారు. అందలమాల పంచాయితీ ఎస్సీ కాలనీకు ఐదు లక్షల రూపాయలతో పైప్ లైన్ పనులు జరుగుతుండగా రహదారి అడ్డంకుల కారణంగా రోడ్డుకి ఇరుపక్కల వున్న మహిళలు మురికి నీటి సమస్య వల్ల అంతరాయం దారితీసింది. దీంతో ఇళ్లల్లో నుండి మురికి నీటిని దారిలోకి రావడంతో గ్రామంలో ఉన్న మహిళల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో అధికారులు స్పందించి ఎంపిడిఓ సాయి ప్రసాద్, మండల పార్టీ టిడిపి కన్వీనర్ మధుసూధన్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, పంచాయతీ కార్యదర్శులు రోడ్డుకు ఇరువర్గాల మహిళలను పిలిచి సమస్యను పరిష్కరించి పైప్ లైన్ పనులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సమస్యను సున్నితంగా అధికారులు పరిష్కరించారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే



విజయపురం, జనవరి 21 ప్రభాతవార్త: నగరిలో 24వ తేదీ శనివారం సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన విజయ పురంలో టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆవాస ప్రాంతాల వారీగా సీఎం పర్యటనకు జనసమీకరణ చేయడానికి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. అవసరం మేరకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొదటి సారి నగరికి వస్తున్నారని, పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు, జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, ఎంపీపీ లక్ష్మీపతి రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు,ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, గుణ భూషణమ్మ, దశరథరాజు,బాలాజీనాయుడు, వేణుగోపాల్‌నాయుడు, హరికృష్ణ, ఉదయకుమార్‌రెడ్డి, నాగభూషణం యాదవ్, శివలింగం, మురళి, రవిరాజు, మురళీనాయుడు, నారాయణరాజు, కపిల్, బాబు, లక్ష్మీపతి, సెల్వం, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య పద సంపదను... భావితరాలకు అందించాలి

### -మేడసాని మోహన్



తిరుపతి,జనవరి 21ప్రభాతవార్త: తాళ్లపాక అన్నమాచార్యులు తెలుగు పద సాహిత్యానికి ఆద్యుడని, ఆయన పద సంపదను భావితరాలకు అందించడంలో గౌరి పెద్ది రామసుబ్బశర్మ చేసిన కృషి చిరస్మరణీయమని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ చెప్పారు. అన్నమాచార్య కళామందిరంలో బుధవారం గౌరి పెద్ది రామసుబ్బశర్మ 35వ వర్ధంతి సభ జరిగింది. సదస్సుకు అధ్యక్షత వహించిన మేడసాని మోహన్ మాట్లాడుతూ శ్రీవారికి పరమ భక్తుడైన అన్నమాచార్యులవారు గానం చేసిన పద కవితలను విశ్లేషించి చెప్పాలంటే, శ్రీవారి భక్తుడైన గౌరిపెద్ది రామసుబ్బశర్మ పరిష్కరిం చారన్నారు. అన్నమాచార్యులవారు గానం చేసిన సంకీర్త నాలను గౌరిపెద్ది వారు స్పష్టంగా తెలియజేశారని చెప్పారు. తాళపత్రాల ద్వారా సుమారు 300 అన్నమయ్య కీర్తనలు వెలుగులోకి వచ్చాయన్నారు. తామ్ర(రాగి) పత్రాల ద్వారానే ఎక్కువ కీర్తనలు మనకు లభించాయన్నారు. తిరుమలశ్రీవారి ఆలయంలోని ఐదు బండరాళ్లపై చెక్కిన శాసనాల ద్వారా కొన్నికీర్తనలు 1949లో వెలుగులోకి వచ్చాయని వివరించారు. తిరుపతి ఎస్వీ ప్రాచ్య పరిశోధనా సంస్థ విశ్రాంత ఆచార్యులు ఆచార్య గోవిందరాజు,హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాహితీవేత్త శంకర్ రావు తో కలసి ఎస్వీ ఓరియంటల్ కాలేజీ సమీపంలోఉన్నగౌరిపెద్ది రామసుబ్బశర్మ విగ్రహానికి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గౌరిపెద్ది శంకర భగవాన్, గౌరిపెద్ది కుటుంబ సభ్యులు అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకురాలు లత, ప్రోగ్రాం అసిస్టెంట్ కోకిల, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

## మూలకోన నూతన కమిటీ ఎంపిక



పుత్తూరు, జనవరి 21 ప్రభాతవార్త : పుత్తూరు రూరల్ మండల పరిధిలోని మూల కోన సంగమేశ్వర ఆలయం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశాల మేరకు కమిటీని ఎంపిక చేసినట్టు ఆయన తెలిపారు. ఛైర్మన్‌గా పి.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా రమణ, పి.రమేష్, గౌరవాధ్యక్షులుగా గాలి చంద్రశేఖర్ (తొరూరు మిల్లు బాబు), భాస్కర్‌రెడ్డి, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా రామచంద్రారెడ్డి, రవి, గురుమూర్తి, పళని, కె.శ్రీనివాసులు, మునేంద్ర, రామచంద్ర, గంగాకుమార్, వెంకటరత్నం, జి.సుబ్రమణ్యం, ఎ.కుమార్, హరి, ఎ.నాగరాజు, పెరుమాళ్, పి.హరి, ఎస్.గంగయ్య, అశోక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ నూతన కమిటీ ఆలయ పవిత్రతను కాపాడుతూ, ఉత్సవాలను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు.

## సరిపడేంత భోజనం అందించండి

### -అన్నా కాంటీన్ల తనిఖీల్లో కమిషనర్ మౌర్య



తిరుపతి,జనవరి 21ప్రభాతవార్త: ఆహారం కోసం అన్న కాంటీన్లకు వచ్చే వారికి సరిపడేంత భోజనం వడ్డించాలని నగరపాలక కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహ కులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం స్విమ్స్ కూడాలిలో ఉన్న అన్న కాంటీన్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు బాగు న్నాయా? సరిపడేంత వడ్డిస్తు న్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అక్కడ భోంచేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని, రుచికరంగా నాణ్యతతో ఉన్నాయని వారు కమిషనర్ కు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్లకు వచ్చే వారికి సరిపడినంత భోజనం అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ గోమతి, తదితరులు ఉన్నారు.

## అంతా సిద్ధం...అప్రమత్తంగా ఉందాం !

### -రథసప్తమి ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు



తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి: ఆదివారం ఉదయం సూర్యజయంతి (రథసప్తమి) సందర్భంగా తిరుమలలో పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. పోలీస్, టిటిడి విజిలెన్స్ అధికారయంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకుని జాగ్రత్తలతో అప్రమత్తమయ్యారు. ఆదివారం ఒకరోజే ఉదయం నుండి రాత్రి వరకు వరుసగా ఏడు వాహనాలపై ఏడుకొండలస్వామి దర్శనమివ్వనుండటం విశేషం. వాహన సేవల వీక్షణకు తిరుమలకు తరలివచ్చే 2లక్షలమందికిపైగా భక్తులకు చిన్నపాటి అసౌకర్యం కలగకుండా, భద్రత పరంగా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లలోనికి భక్తులను అనుమతించే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలను ఎస్పీ బుధవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, సౌకర్య వంతంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల నియంత్రణపై సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, విజిలెన్స్ విభాగం వివిఎస్‌ఓలు ఎన్టీవి రామ్‌కుమార్, సురేంద్ర, సిఐలు, ఎస్ఐలతో కలసి పలు సూచనలు చేశారు.

## ఆధ్యాత్మికతతో కర్తవ్య నిర్వహణ అంశంపై ప్రసంగం



సత్యవేడు, జనవరి 21 ప్రభాతవార్త: శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి, హైదరాబాద్‌కు చెందిన విజ్డయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మి కతతో కర్తవ్య నిర్వహణ అనే అంశంపై బుధవారం ఉదయం శ్రీసిటీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తత్వవేత్త వినయ్‌జీ స్ఫూర్తిదాయక ప్రసంగం చేయగా, పలువురు పరిశ్రమల ఉద్యోగులు, విద్యావేత్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ఆధునిక జీవనంలో ఆధ్యాత్మికత ఆవశ్యకతపై తగు అవగాహన పొందారు. స్థానిక బీరోలెక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి అతిథిని పరిచయం చేసి వినయ్‌జీ బోధనలపై తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. వినయ్‌జీ తన ప్రసంగంలో భగవద్గీత ఆధారంగా ఆధునిక ఉద్యోగ జీవనంలో ఆధ్యాత్మికత ప్రాముఖ్యతను వివరించారు. తమ ఆహ్వానం మేరకు శ్రీసిటీ విచ్చేసి విలువైన ప్రసంగం చేసిన విజయ్‌జీకి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంస్థ ఉపన్యాసాలు, అధ్యయన తరగతులు, వర్క్‌షాపులు, కార్పొరేట్ సెమినార్ల ద్వారా ఒత్తిడి నిర్వహణ,స్వీయఅభివృద్ధి అర్థవంతమైన జీవనవిధానానికి దోహదపడే ఆధ్యాత్మిక అంశాలను వివరిస్తాయి.

## రెండులక్షల బీమా చెక్కు అందజేత



పెద్దపంజాణి జనవరి 21 ప్రభాతవార్త: మండలంలోని గోనుమాకులపల్లి గ్రామానికి చెందిన రాజమ్మ ఇటీవలే మృతిచెందింది. ఈమె ఆంధ్రప్రదేశ్ గ్రామీన బ్యాంకులో బీమా చేసి ఉండటంతో ఆమెకు రెండులక్షల రూపాయలు భీమానగదు మంజూరైంది. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన పథకంకింద మంజూరైన రెండులక్షల చెక్కును మాజీ ఎంపిపీ రెడ్డివారి విజయ్‌భాస్కర్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చామనేరు సర్పంచ్ మంజులమ్మ,సప్తగిరి గ్రామీనబ్యాంకు మేనేజర్ శరవణ కుమారన్, వైస్ సర్పంచ్ రాజారెడ్డి,సంఘమిత్ర ప్రభాకర్ రెడ్డి,బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్య సేవలో కన్నా పూజలు



శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త: మాజీ మంత్రి, రాష్ట్ర బిజెపి మాజీ అధ్యక్షుడు ప్రస్తుతం సత్తెన్నపల్లి శాసనసభ్యుడు కన్నాలక్ష్మీనారాయణ బుధవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఓవైపు ఆలయ మర్యాదలు మరో వైపు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో వేర్వేరుగా స్వాగతం పలికారు. కన్నా లక్ష్మీనారాయణ కుటుంబసమేతంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. పూజల అనంతరం వారికి ఎఇఒ మోహన్, బోర్డు సభ్యుడు నాగరాజులు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## వికెఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేత జయంపు ఏబి ఆర్ జట్టు



బాలాయపల్లి, జనవరి 21 ప్రభాత వార్త: మండలం జయంపు గ్రామంలో వికెఆర్‌యూత్ ఆధ్వర్యంలో గత 10 రోజులుగా జరుగుతున్న వికెఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఫైనల్‌కు చేరిన జయంపు ఏబీఆర్ యూత్ వర్సెస్ గూడూరు చవటపాలెం జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో జయంపు జట్టు 132 పరుగులు చేసి విన్నర్‌గా, గూడూరు చవటపాలెం జట్టు 64 పరుగులు చేసి రన్నర్‌గా నిలిచాయి. బహుమతుల ప్రధానోత్సవం కార్యక్రమానికి బాలాయపల్లి మండలం వైసీపీ అధ్యక్షులు వెందోటి. కార్తీక్‌రెడ్డి, జయంపు రవి, గజరావు. శ్రీనివాసులు, ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. వెందోటి. కార్తీక్‌రెడ్డి దాతృత్వంతో జయంపు ఏబీఆర్ యూత్ జట్టుకు ప్రథమ బహుమతిగా 20,116 రూపాయలు షీల్డ్స్, జయంపు రాజా దాతృత్వంతో ద్వితీయ బహుమతి గూడూరు చవటపాలెం జట్టుకు 10,116 రూపాయలు షీల్డ్స్ బహుమతులను ప్రధానం చేశారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక సామర్థం మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బైకును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు...వ్యక్తి దుర్మరణం



పెళ్లకూరు, జనవరి 21 ప్రభాతవార్త: మండలంలోని దిగువచావలి ఫ్లైఓవర్ పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంకాలం నాయుడుపేట లోని అగ్రహారం పేటకు చెందిన షాహుద్దీన్ (40) అనే వ్యక్తి బైక్‌పై శ్రీకాళహస్తికి వెళుతుండగా చావాలి వద్దకు రాగానే బెంగళూరు నుండి విజయవాడ వెళుతున్న కెఎస్ఆర్‌టిసి బస్సు బైక్‌ను ఢీకొనగా, షాహుద్దీన్‌కు తీవ్ర గాయాలతో అక్కడకక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతిని యొక్క బంధువులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## జనసేన కార్యకర్త అకాల మరణం



నాయుడుపేట, జనవరి 21 ప్రభాతవార్త: పట్టణ జనసేన పార్టీ క్రియాశీలక కార్యకర్త వినోద్ దుర్గ అకాల మరణం చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందని సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ వారి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద కుటుంబ సభ్యులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరపున కొంత నగదు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు బాబు శెట్టి, సోమశేఖర్, వీర మహిళ రోహిణి, జనసైనికులు మున్నా, ఇస్మాయిల్. హుస్సేన్. సూరి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి పథకాలతో ప్రజలు ఆకర్షితులు : ముక్కా రూపానంద రెడ్డి



రైల్వేకోడూరు జనవరి 21 ప్రభాతవార్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఎంతోమంది ఆకర్షితులవుతున్నారని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని కెఆర్ కండ్రిక గ్రామంలో క్షత్రియకులానికి చెందిన దాదాపు 60 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ సర్పంచి ముద్దనూరు రామచంద్ర రాజుతో పాటు కేఆర్‌కండ్రిక గ్రామంలోని క్షత్రియులు భారీగా టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఇటీవల దాదాపు వందలాది కుటుంబాలు వైసీపీని విడిచి టిడిపిలోకి చేరారన్నారు. తాము చెప్పిందే చేస్తామని ఉత్తుత్తి హామీలు తమకు తెలియదని ఆయన అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వందలాది కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, తాను చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు, గ్రామీణ రోడ్లు, విద్యుత్తు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి, క్షత్రియ నాయకులైన సూరపరాజు సుబ్బరాజు, కోడూరు మాజీ సర్పంచ్ మల్లిశెట్టి మురళీధర్ గౌడ్, ఓబులవారిపల్లి మండల అధ్యక్షుడు గంగరాజు వెంకటేశ్వరరాజు, శివరాజు, తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, నాగేశ్వర్ రెడ్డి, గిరి, శివయ్య, కమటం నాగరాజు, అద్దిపల్లి వెంకటేశ్వరరాజు, డికెఆర్, సుబ్రహ్మణ్యం నాయుడు, ఎన్ఎస్ఆర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు

## గంజాయి బ్యాచ్ కాదు... మా ఇంటిపై దాడి చేసింది సన్నీ

### -బాధితురాలు తానాటి మౌనిక పోలీసులకు ఫిర్యాదు



చంద్రగిరి, జనవరి 21 ప్రభాతవార్త: మా ఇంటిపై దాడికి పాల్పడింది గంజాయి బ్యాచ్ కాదు మా గ్రామానికి చెందిన లత కుమారుడు శ్రీవాస్తవ అలియాస్ సన్నీ అని బాధితురాలు తానాటి మౌనిక అన్నారు. ఎగువ రెడ్డివారిపల్లికి చెందిన తానాటి నవీన్‌రెడ్డి భార్య తానాటి మౌనిక బుధవారం ఈ మేరకు పోలీసుకు ఫిర్యాదు చేశారు. గతంలో నా భర్తకు ఎగువ రెడ్డివారిపల్లికి చెందిన సన్నీకి మధ్యన గొడవ జరిగిందన్నారు. ఆ గొడవను మనసులో పెట్టుకుని మంగళవారం రాత్రి మా ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. అసభ్యంగా తిడుతూ, సిమెంట్ రాళ్ళు, రాడ్‌లతో మా తలుపులు కొట్టాడనీ, కిటికీ అద్దాలు ధ్వంసం చేశాడన్నారు. పోలీసులకు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చేలోపు పారిపోయాడు. పోలీసులు రాకతో పారిపోయిన సన్నీ పోలీసులు వెళ్ళాక మళ్ళీ వచ్చాడు. ఈ విధంగా మూడుసార్లు మా ఇంటిపై దాడికి వచ్చి ఈ సారి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసి నిప్పు పెట్టే ప్రయత్నం చేశాడు. ఇదిలా వుండగా మా ఇంటిపై గంజాయి బ్యాచ్ దాడులకు పాల్పడినట్లు సోషల్ మీడియాలో వచ్చిందన్నారు. సన్నీ మద్యం మత్తులో దాడిచేసినట్లు బాధితులు చెప్పినట్లు వివరించారు. కాగా చంద్రగిరి, రెడ్డివారిపల్లిలో సన్నీ బాధితులు అనేక మంది వున్నారని పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కార్మికులు ఇపిఎఫ్, ఇయస్ఐలో నమోదు చేసుకోండి





తిరుపతిరూరల్, జనవరి 21 ప్రభాతవార్త: వివిధ సంస్థలలో పనిచేసే కార్మికులు తప్పనిసరిగా ఇపిఎఫ్, ఇయస్ఐలో నమోదు చేసుకోవాలని డిఆర్వో నరసింహులు తెలిపారు. పియం వికసిత్ భారత్ రోజ్‌గారి యోజన, పియం స్రీ స్కీమ్ గురించి ఇపిఎఫ్, ఇయస్ఐ డైరెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) నరసింహులు, కార్మిక శాఖ కన్వీనర్ యన్.సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్, మున్సిఫల్ పరిపాలన, ఆర్ అండ్ బి, హౌసింగ్, ఇరిగేషన్ తదితర లైన్ డిపార్ట్‌మెంట్లకు చెందిన సంబంధిత అధికారులు హాజరై...వివిధ సంస్థలలో 10మంది అంతకుపైన వున్న కార్మికులు పనిచేస్తుంటే వాళ్ళు తప్పనిసరిగా ఇఎస్ఐలో, 20మంది అంతకుపైన వున్న కార్మికులు పని చేస్తున్న తప్పనిసరిగా ఇపిఎఫ్‌లో నమోదు చేసుకుని, కాంటిబ్యూషన్ చెల్లించి సంక్షేమ పథకాలు అమలు చేసుకోమని, అవగాహన కల్పించారని తెలిపారు. కార్మికులందరిని స్కీమ్‌లో నమోదు చేయుటకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారని ఉప కార్మిక కమీషనర్ తెలిపారు. ప్రతి భవన యజమాని తప్పనిసరిగా...1శాతం కార్మిక సెస్ చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్ భవన...ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం ప్రకారం భవనాలు...ఇతర నిర్మాణ పనులు చేపట్టే ప్రతి యజమాని నిర్మాణ వ్యయంపై 1శాతం కార్మిక సెస్‌ను తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి చెల్లించాలని ఉప కార్మిక కమీషనర్ తెలిపారు.